ప్రజాశక్తి
శుక్రవారం 3 నవంబర్ 2023
5
విజయనగరం



పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రానున్న కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం పంచారామ క్షేత్ర దర్శనాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. పంచారామ క్షేత్రాలుగా పేరుగాంచిన అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కుమారలింగేశ్వరుడు) పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఆర్‌టిసి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రత్యేకంగా నడుపనున్నట్లు తెలిపారు. పంచారామదర్శిని బస్సులు కార్తీకమాసంలో ప్రతీ ఆదివారం ఈనెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీలలో సాయంత్రం విజయనగరం డిపో నుంచి బయలుదేరి మంగళవారం వేకువ ఝామున తిరిగి చేరుతాయని తెలిపారు. పూర్తి బస్సును బుక్ చేసుకొని బృందాలుగా వెళ్లే భక్తుల సౌకర్యార్థం వారు ఎక్కే ప్రదేశానికి బస్సు పంపుతామని తెలిపారు. సూపర్ లగ్జరీ రూ.1960, అల్ట్రా డీలక్స్ రూ.1920 , ఎక్స్‌ప్రెస్ రూ.1530 ఛార్జీలుగా ఉన్నాయని తెలిపారు. వివరాలకు 9959225620, 9494331213, 7382921380 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కరువు కనిపించదా?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎటు చూసినా ఎండిపోయిన పంట పొలాలు, బీటలు వారిన భూములతో కరువు దుస్థితి కళ్లముందు కదిలాడుతోంది. అయినప్పటికీ, మంత్రులు, ఎమ్మెల్యేలకు రైతుల బాధలు, ఇబ్బందులు, ఆందోళన కరమైన దుస్థితి కనిపించలేదు. నిబంధనల బూచీ అడ్డు రావడం వల్ల అధికారులు కూడా కరువు నివేదికలు పంపలేదు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన 103 కరువు మండలాల జాబితాలో ఉమ్మడి జిల్లాల్లో 20 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఉన్నప్పటికీ ఒక్క మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా గుర్తించకపోవడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది.

- ఆగస్టు వరకూ వరినాట్లు
- అక్టోబర్‌లో రాలని చినుకు
- కొంపముంచిన వర్షపాతం
- బీటలు వారిన పంట భూములు
- ఉమ్మడి జిల్లాలో విలవిల్లాడుతున్న రైతాంగం
- పట్టని పాలకులు

నీరుతడి లేక ఎండిపోతున్న వరిపొలం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. విజయనగరం జిల్లాలో ఖరీఫ్‌లో అన్ని పంటలూ కలిపి 3,09,834 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా, నీటి ఎద్దడి కారణంగా అతికష్టం మీద 2,80,738 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 2,31,835 ఎకరాల్లో సాగైంది. ఆ తరువాత స్థానంలో 30, 581 ఎకరాల్లో సాగయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు ఉన్నాయి. కానీ, వర్షపాతం నెలవారీ హెచ్చుతగ్గుల వల్ల సమయానికి నాట్లు పడలేదు. మొక్కజొన్న, పత్తి, అపరాలు సహా అన్ని పంటల సాగూ తగ్గింది.

సాగునీటి వనరులు లేవా?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టులేవీ లేవు. నదులు, జీవగెడ్డలు రాష్ట్రంలో మరెక్కడా చెరువులు ఉన్నప్పటికీ వాటిని నిర్వహణ పాలకులు పూర్తిగా గాలికి వదిలేశారు. తోటపల్లి, జంఝావతి, ఆండ్ర, తాటిపూడి, పెదంకలాం, పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, ఒట్టిగెడ్డ, మడ్డువలస జలాశయాలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ అధ్వానంగా ఉంది. ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు ఏటా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు జలాశయాల కింద నీరు విడుదల చేస్తూ హడావుడి చేయడం తప్పా తరువాత పట్టించుకోవడం లేదు.

సాధారణ వర్షపాతం ఏమైపోయిందంటే..

కొన్ని దశాబ్దాలుగా అధికార, ప్రతిపక్షాలు జిల్లాపై చూపిన నిర్లక్ష్యం వల్ల వర్షపు నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది. ఉన్న కొద్దిపాటి నీరు కూడా పంటపొలాలకు చేరే విధంగా పిల్లకాలువల నిర్మాణం, పూడిక తీత లేదు. దీంతో, సాధారణ వర్షపాతం నమోదైనా పాలకుల పుణ్యమా అని వినియోగంలోకి రాకుండానే పోతోంది. దీనికితోడు వర్షాన్ని కొలిచే రైన్ గేజులు కూడా జిల్లాలో తగినన్ని లేవు. మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల అదే మండలంలో చినుకు కూడా రాలని గ్రామాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉనికిలోకి రావడం లేదు.

భౌతిక పరిస్థితులను పట్టించుకునేదెవరు?

కరువు జిల్లా లేదా మండలంగా గుర్తించాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. కానీ, ప్రత్యేకమైన భౌతిక పరిస్థితుల వల్ల కరువు కాటకాలకు గురైన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు కరువు జిల్లాల జాబితాలో లేకుండా పోయాయి. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ప్రసంగాలు ఊదరగొట్టిన జిల్లా పరిషత్ చైర్మన్ కూడా అటువంటి తీర్మాణం చేసి, ప్రభుత్వానికి నివేదించేందుకు ప్రయత్నం చేయలేదు.

సాగునీటి కాలువల కిందా అంతే సంగతులు

జలాశయాల నిర్వహణ గురించి ప్రభుత్వానికి పట్టకపోవడంతో సాగునీటి కాలువల కింద కూడా పూర్తిస్థాయిలో ఉబాలు కాలేదు. అష్టకష్టాలు పడి ఉబాలు పట్టినప్పటికీ ఇప్పుడు నీరందించుకోలేని దుస్థితి. ఈ ఏడాది తోటపల్లి జలాశయం ద్వారా 78,563 ఎకరాలకు సాగునీరు అందించాల్సివుండగా 53,574 ఎకరాలకు సాగునీరు మాత్రమే అందినట్టు సాక్షాత్తు ప్రాజెక్టు అధికారులు సెలవిస్తుండడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

50శాతం పంటలు ఎండిపోయినట్టే

మొత్తం పంటల విస్తీర్ణంలో ఇప్పటికే 50శాతం ఎండిపోయింది. ముఖ్యంగా వరి లక్ష ఎకరాల్లో ఎండుతోంది. మరో 10వేల ఎకరాల్లో మొక్కజొన్న దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. ఇంకో 10వేల ఎకరాల వరకు పత్తి, అపరాలు, చిరుధాన్యాలు, అపరాలు సాగు దిబ్బతినే ప్రమాదం ఉంది. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల ఎండిన పంటలను పరిశీలించినప్పటికీ విస్తీర్ణాన్ని తక్కువ చూపుతుండడం గమనార్హం.

ఖరీఫ్ సీజన్ వర్షపాతం వివరాలు

నెల	సాధారణ వర్షపాతం(మి.మీ.లో)	కురిసింది వర్షపాతం(మి.మీ.లో)	వ్యత్యాసం
జూన్	124	59	-52
జులై	171	312	+82
ఆగస్టు	188	143	-24
సెప్టెంబర్	185	214	-16
అక్టోబర్	161	22.7	-87.3
మొత్తం	**829**	**749**	**- 80**

కొంపముంచిన వర్షపాతం

సీజన్ ముగిసేనాటికి (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) సాధారణ వర్షపాతం కావడంతో కరువు ప్రాంతంగా గుర్తించడం సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. జూన్‌లో 52 మిల్లీ మీటర్ల మేర లోటు వర్షపాతం నమోదు కావడంతో నారుపోసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. జులైలో 82 మి.మీటర్ల వర్షం అధికంగా కురవడంతో నారుపోత పూర్తయింది. ఆగస్టులో 24 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీంతో, చెరువులు, కాలువలు, వాగుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకొని ఆ నెలాఖరు వరకు ఉబాలు పట్టారు. నాట్లు ఆలస్యం కావడంతో అక్టోబర్ ప్రారంభం నాటికి ముఖ్యంగా వరి వెన్నుకట్టడం, అక్కడక్కడ పొట్ట దశల్లోకు వచ్చాయి. పుష్కలంగా నీరందాల్సిన ఈ సమయంలో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వచ్చింది. అక్టోబర్‌లో 178.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సివుండగా కేవలం కేవలం 22.7 మి.మీ మాత్రమే పడింది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని మండలాల్లోనూ తీవ్ర నీటి ఎద్దడి కనిపిస్తోంది. వరితోపాటు మొక్కజొన్న, పత్తి తదితర పంటలన్నీ ఎండిపోతున్నాయి.

కరువు ప్రతిపాదన పంపలేదు

కరువు ప్రతిపాదనేమీ ప్రభుత్వానికి పంపలేదు. కొంత వరకు పంటలు ఎండిన మాట వాస్తవమే. కానీ, ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. వరుసగా 21రోజులపాటు వ్యవధి ఉండాలన్న నిబంధన కూడా మన జిల్లాకు వర్తించే పరిస్థితి లేదు. అక్టోబర్‌లో వర్షాలు పడలేదు. సెప్టెంబర్ 30 నాటికి ఉన్న పరిస్థితిపై నివేదిక పంపించాం. అప్పటి పరిస్థితిని బట్టి కరువు నిబంధనలు వర్తించే పరిస్థితి లేదు. దీంతో కరువు ప్రాంతంగా గుర్తింపు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

- వి.టి రామారావు
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

504 జెఎఎస్ వైద్య శిబిరాలు..

2.60 లక్షల మందికి వైద్య పరీక్షలు

రిఫర్ చేసిన కేసులు 7764 : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. సెప్టెంబరు 30 నుంచి నవంబర్ 1 వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 474, పట్టణ ప్రాంతాల్లో 30 సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించి 2.60 లక్షల మందికి మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. రక్తపోటుకు సంబంధించి 90,478, మధుమేహం 80,301, మందికి, మలేరియాకు సంబంధించి 1464 మందికి , డెంగీ పరీక్షలు 1493 మందికి జరిపినట్లు తెలిపారు. మూత్ర పరీక్షలు 3,796 మందికి, ఈ.సి జి 47,457 , హెచ్ బి 69,159 మందికి, టి బి పరీక్షలు 1143 మందికి జరిపామన్నారు. కంటివెలుగు కింద 4 వేల మందికి రిఫర్ చేశామన్నారు. వైద్యుల సిఫారసు మేరకు 7,764 మందిని తదుపరి చికిత్స కోసం ఆరోగ్యశ్రీ, ఇతర ఆసుపత్రులకు పంపించినట్లు తెలిపారు. ఈ శిబిరాలు ఈనెల 14 వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతాయని, జిల్లా ప్రజానీకం తమ సమీపంలో జరిగే ఈ శిబిరాలకు హాజరై తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

డివైఎఫ్ఐ జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, యువకులు

ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం గురువారం స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్. హరీష్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్. రుద్రప్రసాద్ మాట్లాడుతూ అందరికీ విద్య, అందరికీ ఉపాధి ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని కోరుతూ 1980లో డివైఎఫ్ఐ ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటినుంచి అవిశ్రాంతంగా పోరాడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ 43 సంవత్సరాల కాలంలో భారతదేశంలో ఘనమైన చరిత్రను నిర్మించిందని తెలిపారు. నేడు అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగాన్ని, పేదరికాన్ని పెంచి పోషిస్తోందని అన్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయని అన్నారు. దేశంలో యువత అభివృద్ధి చెందాలంటే వారి శక్తి సామర్థ్యాలకు తగిన ఉపాధి కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేవారు. రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సితో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల నిరుద్యోగులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిరుద్యోగులు శిరీష , వరలక్ష్మి , రోహిత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో

పైడితల్లమ్మ పండగ విజయవంతం

డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సహకారం, సమన్వయంతో పైడితల్లి అమ్మవారి పండగను ఆనందంగా జరుపుకున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. పైడితల్లమ్మ చదురుగుడి వద్ద సిరిమాను తయారీదారులను సత్కరించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పైడితల్లమ్మ జాతరలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకునే సిరిమానును రూపుదిద్దిన తాళ్లపూడి సోమినాయుడు, కోరాడ నారాయణ, కె.రమణ, మహంతి జగన్నాథం, గురాన బుల్లి, గన్నేవరపు శ్రీనును సత్కరించారు. పైడితల్లమ్మ చిత్రపటాలను బహూకరించారు. కొంత ధన సహాయాన్ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలుస్తున్న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఎన్నడూ లేని విధంగా ఎంతో సరదా సందళ్ళతో సిరిమాను జాతర జరిగిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాతరను సజావుగా నిర్వహించి అందరి మన్నలను పొందుతున్న అధికారులను అభినందించారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ సుధారాణి, తాహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పూజారి బంటుపల్లి వెంకట్రావు, దేవస్థానం పాలకమండలి సభ్యులు, పైడిమాంబ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ కుటుంబానికి పరిహారం అందజేత

గత నెల 29వ తేదీన కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాద దుర్ఘటనలో నగరంలోని తోటపాలెం ప్రాంతానికి చెందిన చల్లా సతీష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల పరిహారానికి సంబంధించి చెక్కును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి సహాయ నిధి నుండి కొంత మొత్తం, రైల్వే శాఖ కొంత మొత్తం మృతుని కుటుంబ సభ్యుల ఖాతాలకు నేరుగా జమ కానున్నదని తెలిపారు. కార్యక్రమంలో మృతుడు సతీష్ తల్లి, భార్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో ఓటరు చేర్పులు, మార్పులు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఈనెల 4, 5 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటూ ఓటర్ల జాబితాలో సవరణలు, కొత్తగా ఓటర్ల నమోదుకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బిఎల్ఒలకు నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చుని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1, 2024 నాటికి 18 సంవత్సరాల వయసు నిండిన లేదా నిండుతున్న వారు ఈ ఏడాది డిసెంబరు 9వ తేదీలోగా కొత్తగా ఓటరు నమోదుకోసం దరఖాస్తు చేసుకోవచ్చుని కలెక్టర్ తెలిపారు. వీరు ఫారం-6లో తమ దరఖాస్తును సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. భారతీయ పాస్‌పోర్టు కలిగి విదేశాలలో వుంటున్న భారతీయులు ఓటరుగా నమోదుకోసం 6ఏ ఫారంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందన్నారు.

ఓటరు జాబితాలో ప్రస్తుతం వున్న పేరును తొలగించడానికి లేదా జాబితాలో పేరు చేర్చడానికి వ్యతిరేకంగా అభ్యంతరం తెలిపేందుకు ఫారం-7లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితాలోని పేర్ల మార్పులు, దిద్దుబాట్లు, అదే శాసనసభా నియోజకవర్గంలో చిరునామా మార్పు, ఒక శాసనసభ నియోజకవర్గం నుంచి వేరొక నియోజకవర్గానికి పేరు మార్పు, ఓటరు ఫోటోగుర్తింపు కార్డు మార్పు, పి.డబ్ల్యు.డి. గుర్తింపుకోసం ఫారం-8లో దరఖాస్తు చేయాల్సి వుంటుందన్నారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా వ్యవహరించే తహశీల్దార్ కార్యాలయాల్లోనూ, బొబ్బిలి, విజయనగరం మునిసిపల్ కమిషనర్ కార్యాలయాల్లో, బిఎల్ఒ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చుని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకొనే అవకాశం

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించదలచిన వారు నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ www.nvsp.in లో లాగిన్ అయి దరఖాస్తులు సమర్పించవచ్చున్నారు. మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఆన్ లైన్ దరఖాస్తులను సమర్పించవచ్చుని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన మరింత సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1950కు డయల్ చేయవచ్చున్నారు. లేదా తమకు సమీపంలోని ఓటర్ల నమోదు అధికారి, సహాయ ఓటర్ల నమోదు అధికారి(తహశీల్దార్), జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సందర్శించి తగు సమాచారం పొందవచ్చుని పేర్కొన్నారు.

ప్రతిభావంతులైన పోలీసు అధికారులకు సేవా పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలువురు పోలీసు అధికారులకు సేవాపతకాలను ప్రకటించింది. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన దిశా మహిళా స్టేషన్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్‌బ్రాంచి ఎస్ఐ కెకెవి విజయనాథ్, విజయనగరం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎఎస్ఐ కె.నూకరాజు, ఆర్మ్‌డ్ రిజర్వు ఎఆర్ హెచ్‌సి ఎల్.వెంకటరమణ, జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో కానిస్టేబుల్ ఎంవిఆర్ సింహాచలం (రామా) ఉన్నారు. పోలీసుశాఖలో ప్రతిష్టాత్మకంగా భావించే సేవా పతకాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్‌పి ఎం.దీపిక, అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఇతర పోలీసు అధికారులు అభినందించి, భవిష్యత్తులో ఇదే స్పూర్తితో పని చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజా రక్షణ కోసం..

- నేడు సిపిఎం ఆధ్వర్యాన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర
- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఆధునీకరణ పేరిట భీమసింగి సుగర్స్ మూత
- రైతుల బకాయి కోసం 'ఎన్‌సిఎస్' భూముల విక్రయం
- విద్యుత్ భారాలతో కుదేలైన ఫెర్రో పరిశ్రమలు
- వెలవెలబోతున్న పారిశ్రామిక వాడలు

జిల్లాలోని కీలకరంగాలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయకపోవడంతో వాటి పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఫలితంగా ఏటా కరువు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చెరకు రైతుల జీవనోపాధిపైనా కోలుకోలేని దెబ్బతీసింది. పరిశ్రమల ఏర్పాటుపై, ఉన్న పరిశ్రమల మనుగడకు సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. విద్యుత్ భారాలతో జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఒక్కక్కొటిగా మూతపడుతున్నాయి. ఇవేవీ పట్టని వైసిపి మళ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తోంది. టిడిపి నాయకులు అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లిన పార్టీ అధినేత చంద్రబాబు కోసం తప్ప, ప్రజా సమస్యలపై స్పందించడం లేదు. జనసేన కూడా అదే దారిలో నడుస్తోంది. ఈనేపథ్యంలో సిపిఎం ప్రజారక్షణ భేరీ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజాసమస్యలపై పోరాడేందుకు సన్నద్ధమైది. అందులో భాగంగానే ఈనెల 30న మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన జిల్లాలోని పలు మండలాలు మీదుగా అల్లూరి జిల్లాలోకి వెళ్లింది. ఇటు మైదాన, పట్టణ ప్రాంతాలను కలుపుతూ శ్రీకాకుళం జిల్లా మందసలో గురువారం ప్రారంభమైన మరో ప్రజారక్షణ భేరీ బస్సుయాత్ర శుక్రవారం పూసపాటిరేగ మీదుగా విజయనగరం, ఎస్.కోట, కొత్తవలస వరకు సాగుతుంది. విజయనగరంలో ఉదయం 10గంటలకు కోట వద్ద బహిరంగ సభ జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన సమస్యలు, ఎన్నికలకు ముందు సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీలను చాలా మంది గుర్తు చేస్తున్నారు.

-ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

సిఎం జగన్ ఎన్నికలకు ముందు విజయనగరం జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో సాగునీటి కేటాయింపులు పెంచుతామని, ఈ జిల్లాలో తోటపల్లి, తామ తీర్ధసాగర్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఆచరణలో మాట నిలబెట్టుకోలేదు. సుమారు 24 వేల ఎకరాలకు సాగునీటితో పాటు విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2004లో తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు గతేడాది (2022-23) 124.50 కోట్లు కేటాయిస్తామంటూ బడ్జెట్ సమావేశంలో చెప్పిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అంతకు ముందు మూడేళ్ల కూడా పెద్దగా నిధులు కేటాయించలేదు. దీంతో, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో భూములు బీడువారుతున్నాయి. ఈ ఏడాది ఈ మండలాల్లో కరువు కోరల్లో ఉన్నాయి. అటు విజయనగరం పట్టణ వాసుల దాహార్తి కూడా తీరడం లేదు.

లక్ష్యానికి చేరుకోని తోటపల్లి

సుమారు 64 వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తోటపల్లి ప్రాజెక్టు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. పెండింగ్ పనుల వల్ల పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. విజయనగరం జిల్లాలో ఈ ఏడాది కేవలం 35వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించినట్టు సాక్షాత్తు అధికారులు చెబుతున్నారు. పునరావాసానికి మొత్తం రూ.204కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై, బతుకు భారమై తల్లడిల్లుతున్నారు.

విద్యుత్ భారంతో కుదేలైన ఫెర్రో పరిశ్రమలు

విద్యుత్ ఛార్జీలతో ల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూడపడుతున్నాయి. అధికారంలోకి రాగానే వీటిని బలోపేతం చేస్తానని సిఎం జగన్ చెప్పారు. గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు పరిశ్రమలు ఉండేవి. వీటిలో మూడు చాలా కాలం క్రితం మూతపడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న సిరి ఫెర్రో, యోన, ఇంపెక్స్, గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేస్ నడుస్తోంది. దీంతో, ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

బొబ్బిలిలో శ్రీనివాసా జ్యూట్ మిల్లును తెరిపిస్తామంటూ జగన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే కూడా హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆచరణలో యాజమాన్యంతో కుమ్మక్కై రియల్ ఎస్టేట్ కోసం విక్రయించారు. దీంతో, వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

ఆధునీకరణ పేరిట రెండేళ్ల క్రితం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తగినంత చెరకు ఉత్పత్తి లేని కారణంగా తెరవలేక పోతున్నామని మంత్రి బొత్స బుకాయిస్తున్నారు. దీంతో, స్థానిక రైతులు రేగిడి మండలం సంకిలి వరకు తీసుకెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

సీతానగరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్స్ యాజమాన్యం రైతులకు బకాయిల చెల్లింపు పేరిట యాజమాన్యంతో కుమ్మక్కై ఏకంగా ఆ పరిశ్రమకు చెందిన భూములే విక్రయించారు. వీరు ఇక్కడి రైతులు కూడా చెరకు సంకిలి ఫ్యాక్టరీకి తీసుకెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

మరోవైపు సారిపల్లి, విటి అగ్రహారం, కంటకాపల్లి, బొబ్బిలి గ్రోత్ సెంటర్ పారిశ్రామిక వాడలు బోసిపోతున్నాయి. కొత్త పరిశ్రమలు రావడం లేదు సరికదా ఉన్న చిన్నచిన్న పరిశ్రమలు కూడా ఒకొక్కటిగా మూతపడుతున్నాయి. ఎస్.కోటలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామంటూ మంత్రి మండలిలో తీర్మానం చేసినప్పటికీ ఆచరణలో అటువంటి ప్రయత్నాలు కనిపించడం లేదు. ఇలా ఎన్నో సమస్యలు, మరెన్నో అభివృద్ధి ఆటంకాలతో ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగుల వెనక్కి అన్న చందంగా ముందుకు సాగుతోంది. ఈనేపథ్యంలో ప్రజారక్షణ భేరీ పేరిట సిపిఎం పేరిట చేపట్టిన బస్సు యాత్ర చర్చనీయాంశంగా మారింది.

జెఎన్‌టియులో జాతీయ స్థాయి వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాట్లాడుతున్న విసి వెంకట సుబ్బయ్య

స్థానిక జెఎన్‌టియులో ఇసిఇ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్, టెక్ ఫ్లుఎంట్ సంయుక్తంగా జాతీయ స్థాయి వర్క్ షాప్ ఎన్లాగ్ అండ్ డిజిటల్ సి ఎంఒఎస్, విఎల్‌ఎస్ఐ డిజైనింగ్ యూజింగ్ మైక్రో విండో ఎడా టూల్ అనే అంశంపై మూడు రోజులు8 పాటు జాతీయస్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తోంది. గురువారం ప్రారంభమైన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. విఎల్‌ఎస్ఐ డిజైన్ ప్రావీణ్యం కలిగిన వారిపై చాలా ఎక్కువ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఫ్యాకల్టీకి కూడా ఈ వర్క్‌షాప్ బాగా ఉపయోగపడుతుందని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ మాట్లాడుతూ రోబోటిక్ ఆటోమేషన్ గురించి అవగాహన కలిగి ఉండడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ప్రత్యేక అతిథిగా మైక్రో విండ్ ఇండియా హెడ్ వినయ్‌శర్మ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరిస్తూ పైన అంశం పైన ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి.నలిని కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గురునాథ్ పాల్గొన్నారు.

మద్యం అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే..

విజయనగరం కోట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 36 వేల కోట్లు మద్యం కుంభకోణంపై కేంద్రానికి ఆధారాలతో సహా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ఇచ్చిన నివేదికను కప్పిపుచ్చుకోవడానికి కొల్లు రవీంద్ర, చంద్రబాబుపై తప్పుడు కేసులు పెడుతున్నారని పలువురు బిసి నాయకులు ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర తూర్పు కాపు సాధికార కన్వీనర్ కంది మురళి నాయుడు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడారు. చంద్రబాబుకు బెయిల్ వస్తుందని తెలుసుకొని కొల్లు రవీంద్రపైనా, చంద్రబాబుపైనా మరో మద్యం కేసు పెట్టడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో నాసిరకం మద్యంతో అడ్డంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. సిబిఐ విచారణ చేసే వైసిపి ప్రభుత్వ అవినీతి కుంభకోణాలు బయటపడతాయని అన్నారు. సమావేశంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు లెంక శంకర్రావు, తూర్పు కాపు విజయనగరం నియోజకవర్గ డైరెక్టర్ తోంగ్రోతు అప్పలనాయుడు పద్మశాలి సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ మాడిమి దేవేంద్రనాథ్, రాష్ట్ర మెంబర్ బి.కుమార్ స్వామి, పి శంకర్‌రావు, భాస్కరరావు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 8న చేపట్టే విద్యాసంస్థల బంద్‌ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు చేపట్టిన దీక్షలు వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. విద్యార్థి లోకాన్ని ఐక్యం చేసి విద్యార్థి ఉద్యమాల ద్వారా విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, రమేష్, సోమేశ్, చరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి జగన్మోహనరావు

వలసల నివారణకు ఉపాధి

ప్రజాశక్తి-రేగిడి

గ్రామాల్లో వలసల నివారణకు ఉపాధి హామీ పనులు గుర్తించాలని, అందుకు ప్రణాళిక బద్ధంగా ప్రతిపాదనలు తయారు చేయాలని వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. ఈ మేరకు గురువారం బూరాడ గ్రామంలో సర్పంచ్ వావిలపల్లి శోభాపుణరావు అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గ్రామసభ నిర్వహించారు. రూ.1.84 కోట్లతో 45 పనులు గుర్తించి, పంచాయతీ పాలకవర్గం తీర్మానించినట్లు ఎపిఒ ఎస్.హరినాథ్ తెలిపారు.

ప్రజారక్షణ భేరి విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయాలని బొబ్బిలి చర్చి సెంటర్లో గురువారం సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు, నాయకులు ఎస్.గోపాల్ ప్రచారం చేశారు. ప్రజా రక్షణ భేరిలో భాగంగా ఈ నెల 15న నిర్వహించే భారీ విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

జూడో జాతీయ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 ఎస్‌జిఎఫ్ జూడో రాష్ట్ర పోటీల్లో జిల్లాకు చెందిన యశోద, నీలిమ బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న జూడో జాతీయ పోటీల్లో పాల్గొంటారని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎస్ఎన్ కృష్ణ తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు.

ఓటర్ నమోదుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

ఓటర్ నమోదుపై 18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఓటర్ల ప్రత్యేక సారాంశ సవరణ -2024లో భాగంగా ఓటర్ల అవగాహన కోసం నూతన ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన సూచనల బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్య పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగు భాషా అభ్యున్నతికి పద్యం ఒక వైద్యుల్లాంటిది అని శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఆర్ బి రామానాయుడు అన్నారు. గురువారం స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో రాగయుక్తంగా పద్య పఠనంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పద్య పఠనంపై తమ ప్రతిభను చాటుకొని అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ తెలుగు ద్వారానే మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటి తరానికి తెలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఇఒ బాలభాస్కరరావు

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి వేపాడ

మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ బాల భాస్కరరావు గురువారం సందర్శించారు. విద్యార్థులు వర్క్‌బుక్స్, పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన మెనూ కూడా పరిశీలించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడం, మొక్కల పెంపకం చేపట్టక పోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం పూర్తికాకుండా అసంపూర్తిగా ఉండటం వల్ల నాటిన మొక్కలను మేకలు, పశువులు మేసేస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

పైడితల్లమ్మ హుండీ ఆదాయం రూ.54లక్షలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో రూ.54లక్షల 46వేల 716 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ సుధారాణి తెలిపారు. బుధ, గురువారాల్లో అమ్మవారి చదురుగుడి, వనం గుడి ఆలయాల్లో హుండీలను లెక్కించారు. చదురుగుడిలో గత 18 రోజులకు సంబంధించి హుండీ ఆదాయం రూ.45,55,338, బంగారం 75 గ్రాముల 460 మిల్లీగ్రాములు, వెండి 633 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. వనంగుడిలో 19 రోజులకు గాను రూ.8,91,378 నగదు, బంగారం 12.500 మిల్లీ గ్రాములు, వెండి 164 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

సమాజసేవకు ముందుకు రావాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం కంటోన్మెంట్లో ప్రాంతంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వసతి గృహంలోని అంధ విద్యార్థులకు సుమారు లక్షా 75 వేల రూపాయల చెక్కును వారి పోషణ నిమిత్తం అందజేశారు. జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సంస్థలు వచ్చిన లాభాలలో కొంత మొత్తాన్ని సేవా సంస్థలకు అందించాలని, సామాజిక అవసరాలను గుర్తించి సేవా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జోనల్ ఆఫీసర్ వై.లక్ష్మీనారాయణ, సారథి వెల్ఫేర్ అసోసియేషన్ కోఆర్డినేటర్ ప్రతాప్, వెంకటరావు లతోపాటు, వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

4న నూతన అన్న ప్రసాద భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పంచముఖ ఆంజనేయ నిత్య అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్మించిన నూతన అన్న ప్రసాద భవనం ఈనెల 4 వ తేదీన ఉదయం 8.16గంటలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తున్నట్లు ప్రోజెక్టు చైర్మన్ బొడ్డు సత్యనారాయణ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలతో వృద్ధులకు, అనాథలకు పుల్కాలు, పప్పు ఉచితంగా అందజేసేందుకు పుల్కాయూనిట్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ యూనిట్‌ను ప్రముఖ వ్యాపారవేత్త కేదారిశెట్టి సీతారామమూర్తి (రాంపండు) సమర్పించినట్లు తెలిపారు. సమావేశంలో పెంటపాటి కామరాజు, గోకవరపు ఉదయ్, నాదం, కల్లూరు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అందని పరిహారం

ఎమ్మెల్యేకు విమానాశ్రయ నిర్వాసితుల ఫిర్యాదు

పరిహారం అందలేదని ఎమ్మెల్యేకు చెబుతున్న మాజీ ఎంపిటిసి పైడయ్య

ప్రజాశక్తి-భోగాపురం

పరిహారం సక్రమంగా మంజూరు చేయలేదని గూడెపువలస ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన రెల్లిపేట గ్రామస్తులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు దృష్టికి తీసుకువెళ్లారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గూడెపువలస సచివాలయ పరిధిలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్లారు. విమానాశ్రయ భూములపై న్యాయస్థానానికి వెళ్లిన వారందరికీ ఎకరాకు రూ.85 లక్షలు ఇస్తామని చెప్పి, కేవలం ప్రభుత్వం ఇచ్చిన పరిహారం మాత్రమే అందజేశారని నిర్వాసితులు తెలిపారు. మిగిలిన సొమ్ము సుమారు రూ.2 కోట్లు విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఇస్తుందని నాయకులు చెప్పి మూడేళ్లవుతున్నా ఇవ్వడం లేదని గూడెపువలస మాజీ ఎంపిటిసి ఇంటి పైడయ్య చెప్పారు. ఆ సొమ్ము ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. గ్రామాలు ఖాళీ చేసేటప్పుడు సామాన్లు రవాణా ఛార్జీలు రూ.50 వేలు ఇస్తామని, నేటికీ ఆ సొమ్ము ఇవ్వలేదని నిర్వాసితులు అన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి వారికి న్యాయం చేయాలని కోరారు. ఆర్అండ్ఆర్ కాలనీకి తమ డి-పట్టా భూములు తీసుకున్నప్పుడు విమానాశ్రయ భూములకు ఇచ్చే పరిహారమే ఇస్తామని చెప్పి నేటికీ మిగతా పరిహారం ఇవ్వలేదని రాజారావు అనే యువకుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాడు. దీనిపై కూడా ఎమ్మెల్యే స్పందించి ఈ సమస్యను కూడా చూడాలని డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావుకు సూచించారు. అంతకుముందు గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ప్రభాకరరెడ్డి, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్, నాయకులు కొల్లి రామ్మూర్తి, అప్పలరెడ్డి, పడాల శ్రీనివాసరావు, ఎ.పైడినాయుడు, దల్లి శ్రీనివాసరావు, కొండపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం

భోగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. మండల పరిషత్తు నిధుల నుంచి 10 లక్షల రూపాయలతో పాఠశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, నాయకులు పడాల శ్రీనివాసరావు, కొమ్మూరు సుభాషణరావు, సుందర హరీష్, పడాల భాను, జెఇ చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో వాకింగ్ ట్రాక్‌తోపాటు చిన్నారులు ఆడుకునేందుకు పార్కు నిర్మించాలని యువకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దీనిపై పరిశీలించాలని జెఇకి ఎమ్మెల్యే సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి-విజయనగరం

2వ పట్టణ పోలీసు స్టేషనులో 2018లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన లంకాపట్నంకు చెందిన పొడుగు అరవింద్‌కు మూడేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం గురువారం తీర్పు వెల్లడించిందని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. నిందితుడు బాలికపై లైంగిక నేరానికి పాల్పడడంతో 2వ పట్టణ పోలీసు స్టేషనులో పోక్సో చట్టం యాక్టు ప్రకారం అప్పటి ఎస్ఐ వి. అశోక్ కుమార్ కేసు నమోదు చేసారు. అనంతరం, ఎస్ఐ అశోక్ కుమార్ దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి జడ్జి కె.నాగమణి నిందితుడికి జైలు శిక్ష విధించారని తెలిపారు.

కబడ్డీ పోటీలకు జెఎన్‌టియు జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 2,3తేదీల్లో విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ దువ్వాడ-విశాఖపట్నంలో నిర్వహించబోతున్న ఇంటర్ కాలేజీస్ కబడ్డీ టోర్నమెంట్‌లో విజయనగరం జెఎన్‌టియుజి విద్యార్థులు పాల్గొంటున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె. వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ , ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్ తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారికి కాలేజీ తరుపున క్రీడా దుస్తులు ఇచ్చి ప్రోత్సాహించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే చినప్పలనాయుడు

మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. గురువారం మున్సిపాలిటీలోని మల్లంపేటలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఆయన హాజరయ్యారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి, అక్కడి ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన వైద్యం, ఖరీదైన మందులను అందజేస్తూ వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు తెంటు పార్వతి, కొర్లపు రామారావు, వైసిపి నాయకులు పోల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

బొబ్బిలిరూరల్ : మండలంలోని అలజంగి గ్రామ సచివాలయాన్ని, శివడవలసలో సచివాలయ, ఆర్‌బికె నూతన భవనాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, సర్పంచ్ రేజేటి భద్రమ్మ, జెసిఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, వైసిపి నాయకులు రేజేటి బుజ్జి, పూడి చిన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగారాజు

ఓర్వలేకే చంద్రబాబుపై తప్పుడు కేసులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వం ఓర్వలేక టిడిపి అధినేత చంద్రబాబు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై తప్పుడు మద్యం కేసులు పెడుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఖండించారు. గురువారం నెల్లిమర్లలో తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, బంగార్రాజు ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చంద్రబాబును జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతూ, ఫైబర్ గ్రిడ్, ఇన్నర్ రింగురోడ్డు, అంగళ్లు ఘటనలపైనా కేసులు పెట్టి వేధించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. చంద్రబాబుకు బెయిల్ తథ్యమని తెలియడంతో అప్పటికప్పుడు మద్యం టెండర్లలో ఏదో జరిగిపోయిందంటూ కేసు పెట్టారని, మద్యంలో దోచుకున్నదెవరో పసిపిల్లాడు చెబుతాడని ఎద్దేవాచేశారు. మద్య నిషేధం ఏమైంది జగన్ రెడ్డీ అని ప్రశ్నించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యదర్శి లెంక అప్పలనాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, ఇన్‌ఛార్జి అట్టాడ శ్రీధర్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లెండి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-డెంకాడ

హాషితకు బహుమతి అందజేస్తున్న అతిథులు

లెండి కళాశాల విద్యార్థులు ఎడ్‌గ్రూమ్ బ్లాగ్ రైటింగ్ కాంటెస్ట్‌లో అవార్డులు కైవశం చేసుకోవడం ద్వారా రచనా నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారని వైస్ ప్రిన్సిపల్ తమ్మినేని హరిబాబు తెలిపారు. లెండి ఆన్‌లైన్ ప్రయోగశాల వేదికగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. విదేశీ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ స్కైలార్క్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించారు. సిఎస్ఇ మూడో ఏడాది విద్యార్థి హాషిత ఈ పోటీలో విజేతగా నిలిచి, మొదటి బహుమతి సాధించింది. సిఎస్ఎస్ఇ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న స్నేహ లతారెడ్డి, భవ్య సాయి కీర్తి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా స్కైలార్క్ సిఇఒ కూచిపూడి సతీష్, ఎడ్‌గ్రూమ్ వ్యవస్థాపకులు వెంకటేష్, స్విగ్గీ డేటా సైంటిస్ట్ జి.విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ పోటీ వ్యక్తిగత విజయాల వేడుకగా మాత్రమే కాకుండా లెండి కళాశాలలో పెంపొందించిన సహకార స్ఫూర్తి, విద్యా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని ప్రిన్సిపల్ వివి రామారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.నరసింహం, అన్ని విభాగాల అధిపతులు ఎం.రాజన్‌బాబు, కె.సుబ్రమణ్య, పూజారి సతీష్, రాజేందర్, జి.సతీష్, పి.దుర్గా శైలజ పాల్గొన్నారు.

రూ.1.38 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మెరకముడిదాం

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

భైరిపురంలో త్వరలో రూ.1.38 కోట్లతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గ్రామంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గడప గడప కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం హామీలు ఇచ్చి నిలబెట్టుకొనే ప్రభుత్వమని, గత ప్రభుత్వం మాదిరిగా ఉచిత హామీలు ఇచ్చి ఎగ్గొట్టే ప్రభుత్వం కాదని అన్నారు. గ్రామంలో అర్హులందరికీ ఇప్పటివరకు సుమారు 18కోట్ల రూపాయలు వేసిందని తెలిపారు. నాడు -నేడు పథకం ద్వారా సుమారు కోటి రూపాయలతో పాఠశాల భవన నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రతి పక్ష నాయకుడు చంద్ర బాబునాయుడు బెయిల్‌పై కొన్ని రోజులు బయటకు వస్తే టిడిపి నాయకులు ఆర్భాటం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.

కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, మండల వైసిపి పార్టీ అధ్యక్షులు కోట్ల వెంకటరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్ వి రమణరాజు, వైస్ ఎంపిపిలు టి. హరిబాబు, కందుల పార్వతి, కెఎస్‌పి ప్రసాద్, తాడ్డి చంద్రశేఖర్, సత్తారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న టిడిపి నేత గొంప క్రిష్ణ

రైలు ప్రమాద బాధితులకు గొంప పరామర్శ

ప్రజాశక్తి - జామి

రైలు ప్రమాద బాధితులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ పరామర్శించారు. మండలంలోని గొడుకొమ్ము గ్రామానికి చెందిన కంచుబరికి రవి ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రవి కుటుంబ సభ్యులను గొంప క్రిష్ణ పరామర్శించారు. ఆ కుటుంబానికి గొంప క్రిష్ణ రూ.5 వేలు, జామి మాజీ సర్పంచ్ ఇప్పాక త్రివేణి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ఎటువంటి కష్టం వచ్చినా టిడిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన నల్లా కుమారికి ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు క్రిష్ణ రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, మాజీ అధ్యక్షులు రెడ్డి పైడిబాబు, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం, నాయకులు గనివాడ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియాపై ఒమ్మిలో అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మిలో ఫైలేరియా నివారణపై సతివాడ పిహెచ్‌సి వైద్యులు సాయిరాం, సాయినందిని గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఫైలేరియాను ఏ విధంగా నివారించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, సతివాడ సర్పంచ్ రేవళ్ళ శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ, ఈసాయి ఫార్మా కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాంగ్‌మేన్ కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-కొత్తవలస



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

రైలుప్రమాద సంఘటనలో దెందేరు గ్రామానికి చెందిన గ్యాంగ్‌మేన్ చింతల కృష్ణంనాయుడు మరణించిన విషయం విదితమే. ఆయన కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నాయకులు మేలాస్త్రీ అప్పారావు, గొర్లె రవి, లక్కవరపుకోట ఎంపిపి గేదెల శ్రీను, దెందేరు సర్పంచ్ వీరోతి వెంకటరమణ, ఎంపిటిసి వెలగల వెంకటరమణ, జామి ఈశ్వరరావు, గవర గణేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో కీర్తివీధి అంగన్వాడీ కేంద్రాన్ని కమిషనర్ పి.బాలాజీప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ హాజరు, బాలామృతం, సంపూర్ణ పోషణ కిట్లు, మధ్యాహ్న భోజన రేషన్‌ను పరిశీలించారు. పోషకాహారం లోపించిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన ఆహారం, సిరప్‌లు అందించాలని అంగన్వాడీ టీచరు, ఎఎన్ఎం, వార్డు మహిళా కార్యదర్శికి ఆదేశాలు జారీచేశారు. ఈ తనిఖీలో ఎఎన్ఎం ధనలక్ష్మి , మహిళా కార్యదర్శి కిరణ్మయి పాల్గొన్నారు.

ఎ.టి.అగ్రహారంలో కొనసాగుతున్న వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

మండలంలోని ఎ.టి.అగ్రహారంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. గురువారం గ్రామంలో సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారి బి.సాయినందిని ఆధ్వర్యంలో వైద్యులు కె.సాయిరాం శిబిరం ఏర్పాటు చేసి డయేరియా రోగులకు సేవలందించారు. ఇప్పటివరకు 12 కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. 10 మందికి నయం కాగా, మరో ఇద్దరికి చికిత్స చేస్తున్నామని తెలిపారు. గ్రామస్తులు పరిశుభ్రత పాటించి, కాచి చల్లార్చిన నీరు తీసుకోవాలని సూచించారు. వారం రోజులుగా డయేరియా ప్రబలి గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటే పారిశుధ్య పనులు గురువారం ప్రారంభించడం కొసమెరుపు. పారిశుధ్య పనులు జరిగే చోట కార్యదర్శి లేకపోవడం గమనార్హం. ఇతర అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. గ్రామాన్ని 'ప్రజాశక్తి' సందర్శించి, పారిశుధ్య పనులు పరిశీలిస్తుండగా, సర్పంచ్ కుమారుడు రుసరుసలాడారు. ఎవరికి చెప్పి పత్రికలో రాశావంటూ చిర్రుబుర్రులాడారు.

వైసిపి బస్సుయాత్ర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోటలో ఈ నెల నాలుగో తేదిన నిర్వహించే సామాజిక సాధికార యాత్ర (బస్సు యాత్ర) ఏర్పాట్లను జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఇందుకూరి రఘురాజు, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర ఫోక్, కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండలాధ్యక్షులు గొర్లె రవి, ఎం.జగన్నాథం, మోపాడ కుమార్, ఎంపిపిలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్రల లారీ బోల్తా

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో కారాడ సమీపంలో కర్రల లారీ బోల్తా పడింది. పారాది వంతెన కుంగడంతో ఆ బ్రిడ్జి పైనుంచి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మండలాల మీదుగా తరలిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతులలో వాహనాలు దిగడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గురువారం కారాడ సమీపంలో కర్రల లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్లు బాగు చేయండి

తెర్లాం-బొబ్బిలి, బాడంగి-బొబ్బిలి రహదారులను బాగు చేసి ప్రమాదాలను నివారించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బోల్తా పడిన కర్రల లారీని గురువారం ఆయన పరిశీలించారు. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలు బాడంగి, తెర్లాం మండలాల మీదుగా తరలించడంతో రహదారిపై పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. గోతులలో వాహనాలు దిగి ప్రమాదాలు సంభవిస్తున్నా రహదారి బాగు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు.

బాణసంచా తయారీదారు అరెస్టు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కొత్తచెలికానివలసలో తామరసింగి కామయ్య బాణసంచా తయారుచేసి, గ్రామాల్లో అమ్మకాలు చేపడుతున్న విషయాన్ని తెలుసుకుని పోలీసులు గురువారం దాడులు చేశారు.. మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని, కామయ్యపై కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు తప్పవని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు హెచ్చరించారు.